*గౌరవం, మన్నన వ్యక్తినిబట్టి లభిస్తాయా? లేక వృత్తినిబట్టా? వ్యక్తి ఉన్నతుడైతే వృత్తి ప్రతిబంధకం కాకపోవచ్చు. కాని, పరిస్థితులుకూడా అందుకు దోహదమివ్వాలి.*

# మానవత్వాన్ని...

జి. ఆంజనేయులు



"శర్మా!"

ఒంటరిగా కూర్చుని ఏదో ఆలోచిస్తున్న శర్మ ఉలిక్కిపడి వెనుకకు తిరిగాడు.

"ఏదో దీర్ఘాలోచనలో ఉన్నావే? నేను డిస్టర్బు చేయలేదుకదా?" అంటూ ప్రక్కనే ఉన్న మరో పెద్ద రాతిమీద కూర్చున్నాడు సుబ్బారాయుడు.

"మరేంలేదు. చాలదూరం వచ్చారే, ఎప్పుడూ లేనిది" అంటూ చిరునవ్వు నవ్వాడు శర్మ.

"ఏదో పెద్దవాణ్ణయిపోయానుకదా! మా చిన్నతనంలో సగం కాలం ఇక్కడే గడిచిపోయింది" అన్నాడు సుబ్బారాయుడు ఆ కొండ తిప్పలను చూపిస్తూ.

"ఈ ప్రదేశం చాల ప్రశాంతంగా ఉంటుంది. కొంతకాలం ఆ పరిసరాలను వదిలివస్తే కొంత విశ్రాంతిగా ఉంటుంది మనస్సుకు" అన్నాడు శర్మ.

"ఏ బాదరబందీలేని నీవే ఇట్లా అంటే నాబోటివాండ్ల సంగతేమిటి, శర్మా? ఎప్పుడూ ఏదో ఒక పనేకదా?"

"మీకేమండీ? ఆరితేరిన రాజకీయవేత్తలు. ఏదో కర్మకాలి ఈవిధంగా ఈఉద్యోగంలో పడ్డారు కాని, మీరు తలుచుకుంటే....." తరువాత, మాట అనటాని కిష్టం లేకనే ఊరుకున్నాడు శర్మ.

శర్మ తన్నంతగా పొగడటం సుబ్బారాయుడుకు వినసొంపుగా ఉంది. సగం నెరిసిన మీసాల సందు నుంచి సంతోషం కొంత చిరునవ్వు రూపంతో వెలువడింది.

"అదేమిటి, నన్ను రాజకీయవేత్తల్లో జమ వేస్తున్నావు? వారి శక్తి సామర్థ్యాలు మనకెక్కడ నుంచి వస్తయ్?"

"ఏమిటి సుబ్బారాయుడుగారూ! ఈ ఊరిలో మీకు తెలియకుండ ఒక్క సంఘటన జరుగుతుందా? ఒక్క పిట్ట మీకు చెప్పకుండ నీళ్ళు తాగుతుందా, చెప్పండి? గ్రామ రాజకీయాల్లో మీదే పైచేయి. మిమ్మల్ని కాదు అనగలవారెవరండీ యిక్కడ?"

"సరేలే. అది నిజమేననుకో. అయినా కాలం పూర్తిగా మారింది. ఈ కుర్రకారు చూచావూ వీరికి పెద్దా, పిన్నా గౌరవం, ఒకమాటమీదుగా పోదామనే బుద్ధీ అవి పూర్తిగా తగ్గిపోయినాయి. ఏమైనా మనకు తిరుగులేదనుకో ఇప్పటికీ"

అంటూ తన ప్రతాపాన్ని కొంచెం బయట పెట్టాడు సుబ్బారాయుడు.

శర్మ కీ మాటలకు కొంచెం అసహ్యమే కలిగింది. కాని దాన్ని దాచుకున్నాడాతడు. తను వచ్చిన విషయం బయట పెట్టడాని కిదే తగిన సమయమనుకున్నాడు సుబ్బారాయుడు.

"నీవేమనుకోకుండ ఉంటే నేనో విషయం చెప్పదలచాను మిస్టర్!" అన్నాడు సుబ్బారాయుడు కొంచెం జంకుగా.

"అదేమిటి? చెప్పండి. అనుకునే దేముంది మనలో" అన్నాడు శర్మ.

"నేను పెద్దవాణ్ణి. మన యీ వృత్తిలో చాల అనుభవమున్నవాణ్ణి. అందువల్ల చెపుతున్నాను, అంతే" అన్నాడు అసలు విషయం బయట పెట్టకుండా.

"విషయమేమిటో చెప్పండి, సుబ్బారాయుడు గారూ!"

"ఏమీలేదు. ఆ ధర్మన్నగారి కుర్రవాడి విషయమే" అన్నాడు తేలికగా సుబ్బారాయుడు.

"ధర్మన్నగారి కుర్రవాడికేమీ?"

"కుర్రవాడికేం? నిక్షేపంలా ఉన్నాడు. వాడికి నీ సబ్జెక్టులోనే కొంచెం మార్కులు తగ్గుతవట. తర్వాత విషయం తెలిసిందే. అన్నట్లు......"

"అయితే?" కొంచెం జుగుప్స మిళితమైన స్వరంతో శర్మ అన్నాడు.

"ఆఁ! ఏముంది, శర్మా, నీకు తెలియంది? వాండ్ల బాధ వాండ్లది. రోజూ నాదుంప తెంపుతున్నారు. సరే, ఏదో చూద్దాంలే అన్నాను. కాని వదిలితేనా?"

"అయితే, సుబ్బారాయుడుగారూ, ఆ కుర్రవాడికి మార్కులు రాకపోయినా నన్ను వేయమంటారు. అంతేనా?"

"ఆ—అంతే." అదేదో సాధారణ విషయంలా అనేశాడు సుబ్బారాయుడు.

"మీరు యింత వయసువారు. మీరే ఇట్లా అన్యాయాన్ని ప్రోత్సహిస్తే ఇక మన వృత్తికి గౌరవాదరాలు రమ్మంటే ఎట్లా వస్తాయి చెప్పండి?"

"నీకు తెలీదు, శర్మా! మాటలు చెప్పేవాండ్లే. పైనుంచి క్రిందిదాకా అట్లాగే ఉంది. మనం ఒక్కళ్లం మడిగట్టుకొని కూచుంటే మనల్ని పిచ్చివాండ్లకింద చూస్తారు."

"ఎవరో మూర్ఖులు చూచారని మనం గడ్డి తింటామటండీ' సుబ్బారాయుడుగారూ?" కొంచెం తీవ్రంగానే అన్నాడు శర్మ.

వ్యవహారం కొంచెం తీవ్రమైందని గమనించాడు సుబ్బారాయుడు. "అదికాదు, శర్మా, నా అభిప్రాయం. నలుగురూ చేసే పని మనం చేస్తే తప్పేమిటనే? మన మొక్కళ్లం లోకాన్ని మరమ్మతు చేస్తామటయ్యా?"

"ఎవరికి వాండ్లు అట్లా అనుకోబట్టే మనం ఇట్లా ఉన్నాము."

"ఆఁ పది డబ్బులు వచ్చేటప్పుడు పోగొట్టుకోవడం అంత తెలివిగల పనికాదు. అందుకని చెప్పాను. ధర్మన్నగారు కావలసినంత ఉన్నవాడు. ఏదో కొంత ముట్టచెప్పకపోడు."

"గడ్డితిని ఆ డబ్బు సంపాదించేకన్నా, ఈ ఉద్యోగాన్ని వదులుకోవడం మంచిది. మధ్య మీబోటి దళారీలు ఉండబట్టే మన వృత్తి ఇలాగైంది."

"నీవేమైనా అను, శర్మా, అవి అనుభవంలేని విషయాలు. ఆదర్శాలూ, ఆశయాలూ అని కూర్చుంటే ఇది కాలంకాదు. పది డబ్బులు ఉన్నవాడే ప్రస్తుతం హోదాగల వ్యక్తిగా చలామణి ఔతాడు. అదీగాక...." ఆగాడు ఆ ఛోటా రాజకీయవేత్త.

"అదీగాక?"

"ధర్మన్నగారితో పగ మంచిదికాదు. అతడీ హైస్కూలుకు విరాళమిచ్చినవాడు. ఊళ్లో అతని మాటకు ఎదురులేదు. మన హెడ్మాస్టరు ఏదైనా అవసరం వస్తే నీ నిజాయితీ చూచి నిన్ను సమర్థిస్తాడా?"

"బెదరిస్తున్నారా? సుబ్బారాయుడుగారూ! ఏదో పెద్దవారని ఇంతవరకు చూచా. మీకు వయసు పెరిగిందేకాని మనసు పెరగలేదు. అటువంటి విషయాలు ఇక ఎప్పుడూ నాతో మాట్లాడకండి." కోపంగా అనేశాడు శర్మ.

"సరేలే మిస్టర్. ఆ ధర్మన్న చెప్పమంటే చెప్పాను. మధ్య నాకేమిటి? ఆ హెడ్మాస్టరు గారే చెపితే అప్పుడేం చేస్తావు? ఇట్లాగే అనగలవా?"

"హెడ్మాస్టరు కాదు; ఈ విషయంలో భగవంతుడు ప్రత్యక్షంగా దిగివచ్చినా నేను లెక్కచేయను." తన స్థిరనిశ్చయాన్ని బయట పెట్టాడు శర్మ.

"నీవు పైకిరావలసినవాడవు. పెద్దవాండ్లతో పగ మంచిదికాదు. ఆత డేం చేయించినా ఈ ఊళ్లో అడ్డుకొనేవాండ్లు లేరు."

"ఫరవాలేదు. నన్ను ఏదైనా చేస్తే నేను బాధపడను. నేనేదైనా తప్పుచేస్తేమాత్రమే బాధపడతాను. మీబోటివాండ్లు ఈ వృత్తికే అసలు..." పూర్తిచేయకుండా ఊరుకున్నాడు శర్మ.

"చెడేవాణ్ణి ఎవరు కాపాడగలరు, శర్మా! ఆలోచించుకో. రేపైనా నీ నిర్ణయం చెప్పు. వారితో చెప్తాను." విసురుగా లేచి నిలువబడ్డాడు సుబ్బారాయుడు. అతని అహం దెబ్బ తిన్నది.

"ఆలోచించే దేమీలేదు. నావల్ల అటువంటి పని జరుగదు." స్థిరనిశ్చయంతో అన్నాడు శర్మ.

"సరే, శర్మా! ఇంతవరకు ఈ స్కూల్లో నా మాటకు ఎవరూ వ్యతిరేకించలేదు. వస్తా."

కోపంగా పెద్ద పెద్ద అంగలువేస్తూ మెట్లుదిగి క్రిందకు పోయినాడు సుబ్బారాయుడు. అతని దుర్మార్గప్రవర్తనకు విస్తుపోయి ఆలోచిస్తూ కూర్చున్నాడు శర్మ కొండ గుట్టమీద. ధర్మన్న తన్నేం చేస్తాడు? బదిలీ

# సుప్రభాతమ్!

ఎమ్. ఎస్. హనుమంతరావు

అరుణారుణ కిరణాలవె
అలమికొనిరియె ఆకసాన!
ఉదయాద్రిని దినకరుడదె
శుభకరుడై అరుదెంచెను!

తూరుపుదెస తోచినవి
తులలేని కషాయరుచులు;
మలయానిల సుమగంధము
లొలికె- మనసు మురిసినదీ!

ఎవరయ్యా రామునివలె
సువిశాలయశోధనులు?
సకలోర్విన సీతవంటి
సతి ఎవరని ప్రభాతాన
వెదకుచుండె కాకా యని
వినువీధిన వాయసాలు.

తరుల శిరోభాగంబున
తరణి కిరణసమూహాలు
నాట్యమాడె నానాగతి.
హిమబిందువు కణములవె
సుమదళముల పైనుండి
సొంపుమీరె ముత్తెములై
చూడ్కులకును విందుసేసి!

కొలనులోని సలిలములో
నిలచెను వికసితపద్మము
వలచిన తనప్రియుకొరకై
కులికినదీ మురిసిపోతు.

జగమంతయు తొలగినదీ
అజ్ఞానతమస్సపుడే!
రవిరాజును కాంచగనే
భువి నూత్నత వెలసినదీ. *

చేయిస్తాడా? బదిలీ అయితే ఫరవాలేదు. ఈ పల్లెలలో హైస్కూళ్ళు, వాటిపై పెత్తనాలు, వాటిలో కుళ్ళు ఆలోచిస్తూ కొండదిగి యింటి వైపు వెళ్ళాడు శర్మ.

* * *

క్లాసులో పాఠం చెపుతున్నాడు శర్మ. పాఠం బాగా సాగిపోతున్నది. చీమ చిటుకు మన్నా వినిపించేంత నిశ్శబ్దంగా ఉంది క్లాసు. ఇంతలో జవాను వెంకన్న వచ్చాడు క్లాసులోకి.

"అయ్యగారు పిలుస్తున్నారు" అన్నాడు వెంకన్న.

తనను హెడ్‌మాస్టరు ఎందుకు పిలుస్తున్నారో అర్థంకాలేదు శర్మకు.

"పాఠం మధ్యలో వస్తావేం?" విసుక్కున్నాడు క్లాసులో శ్రద్ధగా పాఠం వింటున్న మోహన్, పాఠం ఆగిపోయిందనే నిరుత్సాహంతో.

వెంకన్న నవ్వి ఊరుకున్నాడు. ఇంకొకడైతే వెంకన్న గట్టిగానే జవాబు చెప్పేవాడు. మోహన్, హెడ్‌మాస్టరుగారి కొడుకు. అందువల్ల కోపాన్ని నవ్వుతో సరిపెట్టుకున్నాడు వెంకన్న.

శర్మ, హెడ్‌మాస్టరు గదిలోకి వెళ్ళాడు. అక్కడ కుర్చీలో ధర్మన్న కూర్చొని ఉన్నాడు. శర్మను చూచేసరికి ధర్మన్న ముఖమటు తిప్పుకున్నాడు. ఆ కోపాన్ని గమనించిన శర్మ దాన్ని లెక్కచేయలేదు.

"ఏం, శర్మా, మీ వ్యవహారమేం బాగాలేదు." కొంచెం కోపస్వరంతో అన్నాడు హెడ్‌మాస్టరు.

"ఏమిటండీ అసలు విషయం?" ప్రశ్నించాడు శర్మ.

"తెలియనట్లడుగుతారేమండీ? నిన్న ధర్మన్నగారబ్బాయిని బెంచీ ఎక్కించినారటగా?"

అర్థమైంది శర్మకు విషయం. అతనికి నవ్వు వచ్చింది. రోజూ ఎంతమంది పిల్లలను ఎంతమంది ఉపాధ్యాయులు బెంచీ ఎక్కించటం లేదు?

"అవును, నిలబెట్టాను. ఏం, అది తప్పు పనా?" గట్టిగానే అన్నాడు శర్మ.

"తప్పు అంటావేమయ్యా? వయసొచ్చిన కుర్రవాణ్ణి ఆడపిల్లల ఎదుట బెంచీ ఎక్కించటమేమిటి? కొంచెం తెలియక్కర్లా?" కోపంతో వణుకుతూ అన్నాడు ధర్మన్న.

"నాలుగు పంక్తుల పద్యాన్ని చదువుకొని రాలేక ఆడపిల్లలముందు నిలువబడితే లేని నామర్దా, బెంచీ ఎక్కితే వచ్చింది కాబోలు!" వ్యంగ్యంగానే అన్నాడు శర్మ.

"కొంచెం వ్యవహారం తెలుసుకొని మాట్లాడండి. మీ రెక్కడున్నారోకూడా ఆలోచించుకొండి. మీ యిష్టప్రకారం ఆడడానికి వీలుగాదు." ధర్మన్న పెద్ద గొంతుతో అరిచాడు.

"ధర్మన్నగారూ, మీరు పెదగా అరిస్తే ఎవరూ భయపడరు. ధర్మానికిమాత్రం యభపడుతాను నేను. నేను చేసింది తప్పుకాదు. మీ కుర్రవాడి బాగుకోసం చేశాను. క్లాసులో ఒకరిని శిక్షించి మరొకరిని శిక్షించకపోవడం నావల్ల కాదు."

"ఏమిటి, శర్మా, నీవు మాట్లాడేది? పెద్ద మనుష్యులతో మాట్లాడే దావిధంగానేనా? నేర్చుకోవాలయ్యా!"

"ఏమిటండీ, మీరనేది? చేయని తప్పుకు నేను మాటలు పడాలని మీ ఉద్దేశమా?"

"క్లాసును నడపడానికి టాక్టు అవసరం, శర్మా! అది లేకపోతే మనం రాణించలేము."

"అవును. దుర్మార్గాలు చేసి తప్పించుకొని పోవడం టాక్టే అయితే, అది నా కవసరం లేదులెండి. ఇంతకూ నాతో మాట్లాడేదేమైనా ఉందా?" తీవ్రంగానే అన్నాడు శర్మ.

"ఏమిటి, హెడ్‌మాస్టరుగారూ, నీళ్ళ నములుతారు? అసలు ఈ విషయంలో ఆయన క్షమాపణ కోరుతాడో, లేదో అడగండి."

"ఏమిటి? నేనీ విషయంలో క్షమాపణ కోరాలా?" విస్తుబోయి అడిగాడు శర్మ.

"కోరకపోతే వదిలిపెడతామా? మీరేం, ఒక్కరే మొలిచిరాలేదు. మీలాంటివాండ్లను సవాలక్షమంది మేస్టర్లను చూచాను."

"మాటలు కొంచెం గౌరవంగా రానియ్యండి, ధర్మన్నగారూ! మీకు ధనముంటే మాకు గౌరవమున్నది. మీరు జులుం చేయదలుచుకుంటే పైన భగవంతుడున్నాడు."

"చేసినదానికి క్షమాపణ చెప్పుకుంటే తప్పేమిటి, శర్మా!" జంకుతూ అన్నాడు హెడ్‌మాస్టర్.

"మీరు మాకు అధికారులు. మా గౌరవాగౌరవాలు మీవికూడ. ఇందులో క్షమాపణ నేను కోరినా, మీరు కోరినా ఒకటే. ఇందులో నాతప్పుందని మీరు నిరూపిస్తే నేను క్షమాపణ కోరతాను. లేని అపరాధానికి క్షమాపణ నాచేత మీరు కోరించలేరు."

"అట్లా అయితే పాఠశాల ఉనికికి మీవల్ల భంగం కలుగుతున్నదని నేను పైకి రిపోర్టు చేయవలసి ఉంటుంది." కఠినంగా అన్నాడు హెడ్‌మాస్టర్.

"ఇంత తలబిరుసున్నవాడు నా స్కూల్లోనే పనికిరాడు. వెంటనే వ్రాసెయ్యండి. ఈయన రోజులు ఇంతకూ మంచివి కావు" అన్నాడు ధర్మన్న.

"మంచి చెడులు చూచేవాడు వేరే ఉన్నాడు; మీరుమాత్రం కాదు" అంటూ శర్మ చరచర గది బయటకు వచ్చాడు.

ధర్మన్నా, హెడ్‌మాస్టరుగారూ ఒకరి ముఖం ఒకరు చూచుకున్నారు.

"ఏమైనా, సరే హెడ్‌మాస్టరుగారూ, వ్రాసెయ్యండి. తర్వాత పని నేను వెళ్ళి చూస్తాను. ఇతను శంకరగిరి గుట్టలు పట్టకపోతే చూడండి. మర్యాదగా తినలేక......" అంటూ లేచి వెళ్ళిపోయినాడు ధర్మన్న.

* * *

"ఏవండోయ్ శర్మగారూ!" కేకలేస్తూ వచ్చాడు శర్మ బాడుగకుంటున్న యింటి యజమాని వీరయ్యపంతులు.

"ఏం, పంతులుగారూ, కేకలు వేస్తున్నారు? ఏదైనా అర్జంటు పనా, ఏమిటి?" ప్రశ్నించాడు శర్మ.

"మీ వ్యవహారం నాకేమీ బాగా లేదు, శర్మగారూ!" అన్నాడు పంతులుగారు.

"ఏం, పంతులుగారూ, మీకు నేనేం అపకారం చేయలేదే? అదేమిటి అట్లాగంటున్నారు? నావల్ల తప్పేమైనా జరిగిందా?"

"తప్పుగాక మరేమిటయ్యా? ఆ ధర్మన్నతో తగాదా బెట్టుకొని ఈ ఊళ్లో ఉందామనేనా నీ ఉద్దేశ్యం?"



హొయసళేశ్వరాలయంలో
శిల్పం
ప్రతిచిత్రం—కె. మురళీకృష్ణ (వరంగలు)

"అదా సంగతి? సరేసరి. ఫరవాలేదులెండి. ఈ సంగతి మీదాకా వచ్చింది? మీరుకూడ వాండ్ల పిల్లవాడికి మార్కులేయిస్తానని మాట యిచ్చారాయేం?"

"నేను మాట యివ్వాలేదూ, పాడూలేదు. అయినా అతనితో తగాదా పాముతో చెర్లాటం. పేరు ధర్మన్నగాని వాడు.... (అటూ యిటూ చూచి)....పరమదుర్మార్గుడు. లేనిపోని ఈ గొడవ నీకెందుకు, నాయనా, చెప్పు?" అనునయంగా అన్నాడు వీరయ్యపంతులు.

"పంతులుగారూ, మీరు వెయ్యిచెప్పండి. నా ఆత్మకు వ్యతిరేకంగా ఆత్మవంచన చేసికొని ఒక్కపనిగాని చెయ్యను. తరువాత వచ్చేదేదో

# పొదుపుకోసం అమృతాంజన్ అట్టపెట్టెల్లో వస్తోంది

నేడు మన దేశపు ఆదాయము రక్షణ కొరకు అవసరము. సాధారణంగా పరిచితమైన అమృతాంజన్ డబ్బా తయారుచేయడానికి కావలసిన టిన్ రేకు నేడు జాతీయ అత్యవసరాలకు కేటాయింపబడినది. కాబట్టి దీనికి బదులు మేము క్రొత్త రకం పొదుపైన అట్ట పెట్టె వాడుతున్నాము. ఇంతేగాకుండా సీసాలో నమ్మకమైన అమృతాంజన్ అందజేయడానికి మోసంచేయడానికి వీలులేకుండా 'అలు'కాప్ ('Alu'-cap) తో సీసా సీలు చేయబడింది • పూర్వం ఎప్పటికంటే కూడా ఇప్పుడు మీకు అమృతాంజన్ ఎక్కువ అవసరము. కండల నొప్పులు, బెణుకులు, గుండె జలుబులు, కీళ్ళ నొప్పులు, ఆరోగ్యం చెరచి నీరసపరచి అధికంగా కావలసిన ఉత్పత్తులను తగ్గించే రోగాలు నిర్మూలించడానికి సహకరిస్తుంది.

*అమోఘమైనది, మిత వ్యయంతో కూడినది, అనేక విధాల ఉపయోగపడేది.*

అమృతాంజన్ అమోఘంగా పనిచేసే నొప్పుల నివారిణిని మీరు కొనవచ్చు. ఇటువంటి మందులన్నిటికంటె దీనిలో గుణవహకమైన ఔషధాలు అధిక పరిమాణాల్లో ఉంటాయి. • దీనిలో ఏకమైయున్న మందులు బాధలను నివర్తించి వెంటనే ఉపశమనం కలిగించడానికి శరీర చర్మంలో అతి శీఘ్రంగాను లోతుగాను ప్రవేశిస్తాయి ప్రతీసారీ మీకు ఏ నాలుగు వడ్లగింజల ఎత్తో అమృతాంజన్ కావలసి ఉంటుంది. ఇంట్లో ఇంటిల్లిపాదీ ఉపయోగించినా ఒక బుడ్డి నెలల తరబడి ఉపయోగానికి వస్తుంది.





# అమృతాంజనము

ఆరోగ్యం ఇస్తుంది

అమృతాంజన్ లిమిటెడ్ 14/15 లజ్ చర్చి రోడ్, మద్రాసు-4


గుండె జలుబు


కీళ్ళ నొప్పులు


తల నొప్పులు

JWT-AM-2225a

రానివ్వండి.''

''అట్లాగైతే మా యిల్లు ఖాళీచేసి వెళ్ళి, ఇంకోచోట ఉండి, ఆయనతో పోట్లాడు. ప్రొద్దుట ధర్మన్న నలుగురు మనుష్యులను వెంటేసుకొచ్చి మూడు రోజుల్లో ఆయన్ను ఇంట్లోనుంచి వెళ్లగొడితే సరి; లేకపోతే పెంకు లుండవని చెప్పిపోయినాడు. ఆయన్నెదిర్చి నేనీ ఊళ్లో ఉన్నట్లే!''

''అంటే అర్థాంతరంగా ఇప్పుడు నన్నిల్లు ఖాళీ చేయమంటే నావల్ల అయ్యేదా? నాకు వేరే యిల్లేదీ?''

''ఇప్పుడేకాదు. రేపో ఎల్లుండో చెయ్యండి.'' ఏదో కొంచెం ఉదారత కనబరిచాడు వీరయ్య పంతులు.

''మీరంతా చచ్చినవాండ్లలో జమ, పంతులు గారూ! మీ అన్నం మీరు తింటూ ఇంత భయ పడటం ఏమిటో తెలీదు. రేపు నీ కొడుకును ఇంట్లోనుంచి తరిమెయ్యమన్నా మీ గతి యింతేనా?''

వీరయ్యపంతులు 'నిలువునా' నీరైనాడు. ఆలోచనలో పడ్డాడు.

పుస్తకాలు అలమరలో పెట్టి నెమ్మదిగా వంటయింటి కడపవద్ద కూర్చున్నాడు మోహన్. పదమూడేండ్లకే ఫిఫ్త్ఫారంలోకి వచ్చాడు. స్కూలులోకల్లా తెలివైనవాడు మోహన్. ఒకరి జోలి అతనికి లేదు. ఏదో విశేషముంటే, అది తల్లికి చెప్పడానికి వంటయింటివద్దకు వస్తాడు మోహన్. ఒకేబిడ్డ కావడంతో ఆమె వాణ్ణి చాల ముద్దుగా పెంచుకొంటున్నది. తానేం చెప్పాలో తెలియక మాట్లాడకుండ కూర్చున్నాడు మోహన్. కలిపిన కాఫీకప్పు వాడి ముందరపెట్టి త్రాగమన్నది తల్లి. తల యెత్తి తల్లివైపు చూచాడు మోహన్. అతని కను కొలకుల్లో ముత్యాల్లాంటి నీటిబిందువులు నిల్చినాయి. మోహన్ కన్నీరు చూచిన తల్లి హృదయం తల్లడిల్లింది.

''ఏం జరిగింది, మోహన్?'' ప్రశ్నించింది తల్లి వేదనతో.

''నేనోపని చేశానమ్మా! అది తప్పో ఒప్పో నీవు చెప్పు. అసలు నాన్నగారిని చూస్తే నా కసహ్యంగా ఉంది'' అన్నాడు మోహన్.

హెడ్మాస్టరుగారు అప్పుడే పంచలోకి అడుగుపెట్టాడు. కుమారుడన్న మాటలు ఆయన చెవిని పడ్డాయి. తరువాత విందామని ఆయన నిశ్శబ్దంగా కుర్చీలో కూర్చున్నాడు. తండ్రినిగూర్చి పల్లెత్తుమాట అనని మోహన్ అట్లా మాట్లాడటం తల్లికి విచిత్రమైంది.

''ఇంతకూ ఏం జరిగింది, మోహన్?'' అడిగిందామె.

''మా స్కూలులో నిజంగా పిల్ల లకు పాఠం చెప్పుతున్న మాస్టరు శర్మగారేకదే, అమ్మా? మిగిలినవాళ్లంతా బాతాఖానీలు కొడుతుంటే, ఆయనొక్కడే కదు టేక్లాసులో కూర్చుండేది? పాఠం చెప్పేది? అసలు నాన్నేమో శివరాత్రికీ, సంక్రాంతికీ కద క్లాసు కొచ్చేది? అంత మంచివాడిమీద నాన్నెందుకు పైవాండ్లకు చెడుగా రాయాలి?''

''ఏమని వ్రాశారు, మోహన్?''

''ఆయన్ను బదిలీ చేయమని, లేకపోతే స్కూలు చెడిపోతుందనీ వ్రాశారట. ఈ రోజు పై ఆఫీసర్ వచ్చాడు. అంత చక్కగా చెప్పే మాస్టరు మళ్లీ మాకు దొరుకుతారా, అమ్మా, చెప్పు?'' ప్రశ్నవేసి ఊరుకున్నాడు.

''ఆఫీసరు ఏమడిగాడు?''

''క్లాసుకొచ్చి అడిగాడులే. మీకు బాగా పాఠాలు చెప్పేదెవరని అడిగాడు ఆ ఆఫీసరు. వెంటనే లేచి చెప్పడానికి భయపడ్డారందరూ. నేను లేచి శర్మ మేస్టరుగారని చెప్పేశా.'' గర్వంగానే చెప్పాడు మోహన్.

''నీ వెవరబ్బాయి వన్నాడాయన. ప్రక్క వాడు వెంటనే హెడ్మాస్టరుగారబ్బాయి అన్నాడు.''

''అదేమిటోయ్! మీ నాన్న పనికిరాడంటే నీ విట్లా మాట్లాడుతున్నావు అన్నాడు నవ్వుతూ ఆయన.''

''నీవేం పిచ్చిగా మాట్లాడలేదు కద?'' ప్రశ్నించింది తల్లి.

''నిజంగా నా కూరుకోవడానికి బుద్ధి పుట్ట లేదు. అంత అన్యాయాన్ని చూస్తూ ఎట్లా ఊరుకోమంటావమ్మా! నీవే చెప్పు?'' తల్లిని ఎదురు ప్రశ్నించాడు మోహన్.

తన కొడుకు భావాలకా మాతృహృదయం సంతోషంతో ద్రవించిపోయింది.

''నీవేం చెప్పావు, మోహన్?''

''మా నాన్నగారిది పొరపాటు. దీనికంతటికీ ధర్మన్న కారకుడు సార్! అన్నాను. ఆ మాస్టరు గారు లేకపోతే ఈ స్కూల్లో చదువే లేదన్నా నమ్మా! ఆయన్ను ఇక్కడినుంచి మార్చబోకండి సార్ అన్నాను. నాకెందుకో భలే ఏడుపు వచ్చేసిం దమ్మా 'అప్పుడు'' అన్నాడు మోహన్.

ఆమె కండ్లవెంట నీళ్లే వచ్చేసినాయి. మోహన్కు కన్పించకుండా ఆమె తల త్రిప్పి వేసుకుంది.

''అమ్మా!'' పిలిచాడు మోహన్ దీనంగా.

''ఏం నాన్నా?'' అన్నదామె.

''నాది పొరపాటేనా, అమ్మా?''

వరండాలో కూర్చున్న హెడ్మాస్టరుకు కన్నీళ్లు ప్రవాహమైనాయి. ఆతడు తమా యించుకున్నాడు.

''లేదు, నాన్నా. న్యాయంగా మాట్లాడిన నీ మాటల్లో పొరపాటే లేదు. కాని ఇది మీ నాన్నగారి పరువుకు సంబంధించిన విషయం. వారేమంటారో? అదే నా భయం'' అన్నదామె దిగులుగా.

''నీవు పొరపాటు కాదంటే నాకింకేం భయంలేదు. కాదంటే నాన్న నాలుగు తంతా డంతే కదమ్మా! మాట్లాడకుండ దెబ్బలు తింటానులే. ఫర్వాలేదు'' అన్నాడు ధైర్యంగా మోహన్.



పొలంనుంచి

చిత్రం — వై. బాలయ్య (నారాయణరావు పేట)

తననెంత పశువుగా తన కుమారుడు చిత్రించాడో తలుచుకుంటే హెడ్మాస్టరు మనసు విపరీతమైన వేదన చెందింది.

''అమ్మా! ఆ ధర్మన్న అంటే నాన్న కెందుకే అంత భయం? నేనే హెడ్మాస్టర్ నైతేనా, 'గెట్ అవుట్, రాస్కెల్' అని వెంకన్న చేత వాణ్ణి నెట్టించివేయునుటమ్మా'' అన్నాడు మోహన్.

ఆమెకు నవ్వు వచ్చింది. నవ్వింది. ''కాఫీ త్రాగు, మోహన్'' అన్నదామె.

కాఫీకప్పు చేతిలోకి తీసుకొన్నాడు మోహన్.

''అమ్మా! ఆఫీసరుగారు లేచి నా దగ్గఱకు వచ్చాడమ్మా! నా తలమీద చేయివేసి 'నీవు మంచివాడవు, మోహన్' అన్నాడమ్మా!''

హెడ్మాస్టరు ఆగలేక లేచి యింటిలోకి వచ్చాడు. మోహన్ తలవంచుకుని లేచి బయ టకు వెళ్లాడు. కండ్లనీళ్లతో లోపలికి వచ్చిన భర్తను చూచిందామె.

''వాడిమాటలు విన్నారా?''

''విన్నాను. వాడికున్న సంస్కారంలో నూరోవంతు నాలోలేదు. నేనెంత పశువునో వాడు నాకు తెలియజెప్పాడు.''

''శర్మగార్ని ఇంటినుంచి లేచిపొమ్మని వీరయ్య పంతులు బలవంత పెడుతున్నాడట. ఆ ధర్మన్న ఎంత దుర్మార్గుడు!'' కొడుకు మాటలను సూచనగా బలపరిచిందామె.

''అతనికి నేనెందుకు భయపడ్డానో తెలి యదు ఇంతవరకు. నాబిడ్డ నాకండ్లు తెరిపిం చాడు. మోహన్ నీ కొడుకైనందుకు నీవు గర్వించాలి మిస్టర్ అన్నాడు మా ఆఫీసరు'' అన్నాడు హెడ్మాస్టరు కండ్లు ఒత్తుకుంటూ.

ఆమె కండ్లు తుడుచుకుంది, కాఫీ అందిస్తూ.

* * *

"సుబ్బారాయుడుగారూ! సుబ్బారాయుడు గారూ!" లోపలికివచ్చి వెళ్ళుతున్న సుబ్బారాయుణ్ణి కేకవేశాడు హెడ్‌మాస్టరు.

వెనక్కు తిరిగివచ్చిన సుబ్బారాయుడు "ఏమిటి సార్ పిలిచారు?" అన్నాడు.

"ట్రాన్స్‌ఫరు వచ్చిందండీ శర్మకు" అన్నాడు హెడ్‌మాస్టరు.

ఆఫీసునుండి క్లాసులకు వెళ్ళుతున్న ఒక రిద్దరు ఆగి వెనక్కు చూచారు. సుబ్బారాయుడు ముఖం వికసించింది.

"రాదుటండీ, మరి, ధర్మన్నగారు తలుచుకుంటే? ఆగుతుందా? ఆఫీసరుగారు మొదట ట్రాన్స్‌ఫర్ చేయడానికి మొరాయించాడట. ఒక గట్టి రికమెండేషన్ తగిలించేసరికి ఉక్కిరిబిక్కిరై చేసివేశాట్ట. రాత్రే వచ్చాడు ధర్మన్న అక్కడినుంచి." తనలోని కుటిలాన్ని ప్రకటించాడు సుబ్బారాయుడు.

"అంటే మీకన్ని విషయాలూ ముందే తెలుసన్నమాట, సుబ్బారాయుడూ! అయినా నీబుద్ధి ఈజన్మకు మారదు కాబోలు!" అన్నాడు హెడ్‌మాస్టర్ వ్యంగ్యంగా.

"ఏమిటి సార్ మీరట్లా అంటారు? ఇందులో నాదేముంది?" నవ్వాడతడు.

"ఇంతపనికి కారకుడివి నువ్వేకదా, సుబ్బారాయుడూ? శర్మ నీకు చేసిన అపకారమేమిటి చెప్పు? ధర్మన్న గారబ్బాయికి మార్కులు వేయననటమేకదా?"

"మీరు వ్రాయబట్టేకదు సార్ ఆయన ట్రాన్స్‌ఫరుజరిగింది." అన్నాడు సుబ్బారాయుడు, ఈ పాపంలో భాగస్థుడవు నీవుకూడా నన్నట్లు.

"ఆఁ. అందుకు నాకు తగిన శిక్ష జరిగింది, సుబ్బారాయుడూ. నా కొడుకు నాకండ్లు తెరిపించాడు."

"అడుగో ధర్మన్నగారు వస్తున్నారు" అన్నాడు సుబ్బారాయుడు ధీమాగా.

"నేనే పిలిపించాను-ఈ శుభవార్త వినిపించడానికి వారిని" అన్నాడు హెడ్‌మాస్టరుగారు.

ఈ మాటలకు ఒకరిద్దరు అక్కడి ఉపాధ్యాయులు అసహ్యించుకున్నారుకూడా. వారు మెల్లగా బయటకు పోతుంటే హెడ్‌మాస్టరు వారిని వెనక్కు పిల్చాడు. ధర్మన్న చేతికర్ర ఊపుకుంటూ ధీమాగా లోపలికి వచ్చాడు.

"రండి, ధర్మన్నగారూ, రండి. ఆ కుర్చీలో కూర్చోండి" అంటూ కుర్చీ చూపించాడు హెడ్‌మాస్టరు.

"వెంకన్నా! మన టీచర్లందరికీ కుర్చీలు తెచ్చివేసి అందరినీ నేను రమ్మన్నానని పిల్చిరా. ఆఖరు రెండు పీరీడ్లు పిల్లలను ఇండ్లకు వెళ్లమను."

"ఏమిటండోయ్, ఏదో పెద్ద హంగామా చేస్తున్నారే?" అన్నాడు ధర్మన్న కొంచెం అనుమానంగా.

"ధర్మన్నగారూ! మీబోటివాండ్లు తలుచుకుంటే హంగామాకాక మరేముంది? ఇదంతా మీచలవే. ట్రాన్స్‌ఫర్లు, ట్రాన్స్‌ఫరు ఆర్డర్లు వచ్చినాయి. వీరందరికీ నేను టీపార్టీ చేదామనుకుంటున్నాను."

"ఏమిటండోయ్, బహువచనంలో పలుకుతున్నారే?" అన్నాడు ధర్మన్న.

శర్మ మేస్టరుకు ట్రాన్స్‌ఫరు అనే విషయం పిల్లలలో తెలిసింది. శర్మకుకూడా తెలిసింది. నిర్వికారంగా శర్మ ఆఫీసు రూములోకి వచ్చాడు.

"కంగ్రాచులేషన్స్ మిస్టర్ శర్మా!" అన్నాడు హెడ్‌మాస్టరుగారు అతన్ని తనప్రక్కనున్న కుర్చీకి ఆహ్వానిస్తూ.

ధర్మన్న కావని కంటకమైంది. తన ఎదుట అతన్నంత గౌరవిస్తాడా, ఈ హెడ్‌మాస్టరు కెంత పొగరు—అన్నట్టుగా ఉంది అతని చూపు. మిగిలిన ఉపాధ్యాయులందరికి ఆశ్చర్యంగా ఉంది అతని చర్య.

"ధర్మన్నగారూ! మీ రనుకున్న పంతం నెగ్గింది. శర్మగారిని బదిలీ చేయించగలిగారు కాని...." ఆపాడు హెడ్‌మాస్టరు.

"కాని....." ప్రశ్నార్థకంగా చూచాడుధర్మన్న. అందరూ కుతూహలంగా చూచారు.

"కాని ఆయన ప్రవర్తన కనుగుణంగా ఆయన్ను హెడ్‌మాస్టరుగా బదిలీచేశారు."

అక్కడివారి ఆశ్చర్యాని కంతులేదు. ధర్మన్న ముఖాన రక్తపు బొట్టులేదు.

"ఇంకొక చిన్నవిషయం, ధర్మన్నగారూ! నన్నుకూడ ఇక్కడినుండి బదిలీచేశారు."

"ఆ!" అన్నారు ఆశ్చర్యంగా అందరూ ఒక్కసారి.

"ఇది నేను చేసిన అపరాధానికి స్వయంగా విధించుకున్న శిక్ష. అందువల్ల నాకు సంతోషంగా ఉంది, ధర్మన్నగారూ!"

ధర్మన్న పోవడాని కుద్యుక్తుడైనాడు. వెంకన్న టీపార్టీ తినుబండారాలు వాండ్లముందు సర్దుతున్నాడు.

"కూర్చోండి, ధర్మన్నగారూ. టీపార్టీ మధ్య లేచిపోవడం గౌరవంకాదు. మన సుబ్బారాయుడిగారికికూడా ట్రాన్స్‌ఫరు చేశారు. కాని వారిని మాత్రం శర్మగారిదగ్గర అసిస్టెంటుగా వేశారు."

అకాలంలో పిడుగు పడినట్లైంది సుబ్బారాయుడికి. మూర్ఛవచ్చినంత పనైంది. తన కెంత అవమానం జరిగింది! తలకొట్టినట్లైంది. ఇక ఒక క్షణం వీండ్లమధ్య ఉండకూడదు. ఛీత్కారంచేస్తూ లేచాడు ధర్మన్న. బయటి నుంచి ఒక్కసారే నలుగురు కుర్రవాండ్రు తోసుకొని లోపలికి వచ్చారు గాభరాగా.

"ధర్మన్నగారబ్బాయి పెద్ద బావిలో పడ్డాడండి సార్." నలుగురూ ఒక్కసారే అన్నారు.

వెర్రికేక పెట్టి ధర్మన్న అటు పరుగెత్తాడు. ఉపాధ్యాయులందరు ఒకేసారి బిలబిల బయటకు వచ్చారు. పిల్లలందరు బావి చుట్టూ ఉన్నారు.

• • •

శర్మగారిని చూడాలని పిల్లలందరు నిలువబడ్డారు. ధర్మన్నగారి అబ్బాయి అందులో ఒక స్నేహితుణ్ణి పోదాం రమ్మని పిలిచాడు. వాడు నేను రానన్నాడు. "ఆయన్నేందోయ్ పొయ్యేవాణ్ణి చూచేది?" అన్నాడు హేళనగా ధర్మన్నగారబ్బాయి. "ఛీ అవతలికి పో!" అన్నాడా కుర్రవాడు. ఆ ఎగతాళికి కోపం వచ్చింది. "నన్ను ఛీ అంటావా?"


## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక చందాదారులకు విజ్ఞప్తి!

ఆంధ్రప్రభసచిత్రవారపత్రిక కొరకు చందా పంపేవారు ఈ దిగువ పేర్కొన్న అంశాలు పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

1. చందా పంపేటప్పుడు మని ఆర్డర్ కూపనులో కాని, ఉత్తరంలోకాని తమకు ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక పంపాలని స్పష్టంగా వ్రాయాలి.

2. పాత చందాదారులు తమ చందా సంఖ్య ఉదహరించాలి.

3. ఎంతకాలం పంపవలసినది స్పష్టంగా వ్రాయాలి.

4. గ్రామం పేరు, పోస్ట్ ఆఫీసు, ఏఊరుమీదుగా పంపవలసినది (అవసరమైన సందర్భాలలో), తాలూకా, జిల్లా మున్నగు వివరాలు అన్నీ స్పష్టంగా వ్రాయాలి.

5. చందా మొత్తం 'మేనేజర్, ఆంధ్రప్రభ లిమిటెడ్, విసెంటురోడ్డు, గాంధీనగర్, విజయవాడ-3' చిరునామాకు పంపాలి.

**సాలుచందారు.15-60న.పై**

**6 నెలలకు రు.7-80న.పై**

**3 నెలలకు రు.3-90న.పై**

సదా చందాదారుల సహకారం అర్థిస్తున్నాము.

మేనేజరు.

అని ధర్మన్నగారబ్బాయి వాణ్ణి కొట్టాడు. వాడు తిరిగి కలియబడ్డాడు. కొట్టుకోవడంలో బావి ఒడ్డు అని పిల్లలు అరుస్తున్నా లెక్కచేయ లేదు. ధర్మన్నగారబ్బాయి కాలుజారి పడిపోయి నాడు బావిలో.

"నా బిడ్డ, నా బిడ్డ" అంటూ బావివద్దకు పరుగెత్తాడు ధర్మన్న.

# మానవుల్లోనే...

అందులో దిగేదెవరు? అంత పెద్ద దిగుడు బావి అది. చాల లోతు. పెద్ద గజయీతగాండ్లైతేతప్ప దాంట్లో దిగలేరు. ఇక పడ్డ మనిషిని తీయడాని కెవరు సాహసిస్తారు?

ధర్మన్నగారబ్బాయి ఒకసారి పైకివచ్చి మరల మునిగాడు. ధర్మన్న ఆవేదన కంతులేదు. ఆతని కండ్లవెంట నీళ్లు కారిపోతున్నాయి. ఒక్కరూ ఆ అర్భకుణ్ణి రక్షించలేకపోయారు.

శర్మ ఒక్కసారిగా లేచాడు. చొక్కా, పాంటూ విప్పివేశాడు.

"శర్మా! ఆగు" అంటూ చెయ్యి పట్టుకున్నాడు — "ఈ బావిలో దిగడం చావడమే" అంటూ హెడ్‌మాస్టరు.

"పరవాలేదు సార్! ధర్మన్న హీనుడే ఐనా ఆ బిడ్డ నావద్ద చదువుకున్నాడు. నా బిడ్డ వంటివాడు" అంటూనే బావి ఒడ్డుకు నడిచి మధ్యలోకి దూకేశాడు శర్మ.

లోపలికి మునిగిన శర్మ, ధర్మన్న కొడుకును బయటకు తీసుకొని నీళ్లపైకి వచ్చాడు. మెల్లగా ఒడ్డుపైకి చేతులమీద తీసుకొని వచ్చాడు. శర్మగారి గుడ్డలు తీసుకొనివచ్చి ప్రక్కన నిలువబడ్డాడు మోహన్. డాక్టరు వచ్చి ధర్మన్నగారబ్బాయికి ఇంజక్షనిచ్చాడు. ఆ కుర్రవాడు కండ్లు తెరిచాడు.

"శర్మగారూ! మీరు చేసిన ఈ ఉపకారానికి ధర్మన్న జీవితాంతం కృతజ్ఞుడుగా ఉండవచ్చు" అన్నాడు జరిగిన వెనుకటి విషయాలు తెలిసిన డాక్టరు.

"మేస్టరుగారూ!" మోహన్ పిలిచాడు. ఆతని కండ్లనిండా నీళ్లు నిలిచి ఉన్నాయి. గుడ్డలు చూపించాడు మోహన్ చెప్పలేక.

ఆ కండ్లనీళ్లను అర్థంచేసుకున్నాడు శర్మ. అతనిలోని ప్రేమ వాత్సల్యాలు పెల్లుబికినాయి.

"నేను చచ్చిపోతాననుకున్నావా, మోహన్?" అంటూ ఆ తడిగుడ్డలతోనే మోహన్‌ను కౌగలించుకున్నాడు శర్మ.

ఆ గురు శిష్యుల ప్రేమ వాత్సల్యాలను చూచిన మిగిలినవాండ్ల కండ్లు చెమర్చినాయి. శర్మ గుడ్డలు మార్చుకున్నాడు. ధర్మన్న శర్మ వద్దకు వచ్చాడు. శర్మ చేతులు రెండూ పట్టుకున్నాడు ధర్మన్న. ఆతనిలోని పశ్చాత్తాపం అతన్ని దహించివేస్తున్నది.

"నీ మంచితనాన్ని అర్థం చేసుకోలేకపోయినాను, శర్మా! నా తప్పుల్ని క్షమించు."

"అంతమాట వద్దు, ధర్మన్నగారూ! జీవితంలో ఇట్లాంటి సంఘటనలు జరుగకపోతే అది జీవితమేకాదు."

"ఆ పసివాడు చెప్పింది నిజం. నా కండ్లకు కప్పిన అహంకారపు పొరలు ఈపూటతో ఊడిపోయినాయి!" అన్నాడు ధర్మన్న హుందాగా.

విషయం తెలిసి అక్కడకు వచ్చిన వీరయ్య పంతులు "మానవుల్లోనే దేవతలూ, రాక్షసులూ ఉన్నారండీ" అన్నాడు.

"రండి, రండి. కాఫీ చల్లారిపోతున్నది" అంటూ హెచ్చరించాడు హెడ్‌మాస్టరు అందరినీ.

అసలు వ్యక్తి సుబ్బారాయుడుమాత్రం అక్కడ కన్పించలేదు. మోహన్ చేయి పట్టుకొని స్కూల్లోకి నడిచాడు శర్మ అందరితో. ★




మన్నన పొందిన నాయకత్వం

ఆ తరగతికి ఆమె జెట్టి. సాటి పిల్లలందరూ ఆమెను గౌరవడిగా పెట్టుకొనేవారు. తను ధరించే స్వచ్ఛమైన తెల్లటి దుస్తులను చూచి, ఆత్మవిశ్వాసం కలిగి వుండడమేగాక, ఆమె ఎంతగానో గర్వించేది కూడా. ఆమె ధరించే తెల్లని ఉడుపులను రాబిన్ బ్లూ నురుగుతో మసిమి అవి మరింత ప్రకాశించేటట్టు ఆమె తల్లి చేసేది.

రాబిన్ బ్లూ




తెల్ల దుస్తులను మరింత ప్రకాశవంతం చేస్తుంది

ARBC-22 TE